## మెరుగైన వైద్యం అందించాలి

రైల్వేకోడూరు అర్బన్: పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని ఏపీ టూరిజం డైరెక్టర్ మందల నాగేంద్ర శనివారం తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన తనిఖీ చేశారు. ప్రతిరోజూ 300 మంది పేషెంట్లు వైద్యం పొందుతున్నారని తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. ఆసుపత్రి డైరెక్టర్ రత్తయ్య, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

## ఆర్థికసాయం

చిట్వేలి: దొగ్గలపాడుకు చెందిన చౌడవరం చిన్న యానాదిరెడ్డికి వెన్నపూస చికిత్స కోసం ముక్కా సాయివికాష్ రెడ్డి శనివారం రూ. 50వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.బత్తిన వేణుగోపాల్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, వెంకటరెడ్డి, సుబ్రమణ్యం రెడ్డి, సి వెంకటరెడ్డి, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

## హెల్త్ కార్డుల పంపిణీ

చిట్వేలి: నగిరిపాడు రైతు భరోసా కేంద్రం పరిధిలో శనివారం అనిమల్ హెల్త్ కార్డులను పంపిణీ చేసినట్లు చిట్వేలి ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు వరప్రసాద్ తెలియజేశారు. నాగవరం రెడ్డిపల్లి పశువైద్యులు తేజశ్విని ఆధ్వర్యంలో ఆన్‌లైన్ చేసి కార్డులు పంపిణీ చేశారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలు

నందలూరు (రాజంపేట): నందలూరు పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో నందలూరు జూనియర్ సివిల్ జడ్జి కె లత ఇద్దరికి జరిమానా, జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ అబ్దుల్ జహీర్ తెలిపారు. పాలేటి పెంచలయ్యకు రూ.11 వేలు జరిమానా, పుత్తా మల్లికార్జునకు రూ.1000లు జరిమానాతో పాటు ఐదు రోజులు జైలుశిక్ష విధించారని పేర్కొన్నారు.

## వ్యాసరచన పోటీలు

ఓబులవారిపల్లె: జ్ఞానభాండాగారాలు గ్రంథాలయాలని ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు రాజానాయక్ పేర్కొన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు.గ్రథాలయ నిర్వహకుడు అష్రఫ్ అలీ, ఉపాధ్యాయులు చెండ శ్రీనివాసులు, మల్లికార్జునరెడ్డి, రవిచంద్రరాజు పాల్గొన్నారు.

# రాజంపేట ప్రాంతీయ వైద్యశాలకు మహర్దశ

**రాజంపేట ఎమ్మెల్యే మల్లికార్జునరెడ్డి**

రాజంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాజంపేటలోని ప్రాంతీయ వైద్యశాలకు మహర్దశ వచ్చిందని రాజంపేట శాసనసభ్యుడు మేడా మల్లికార్జునరెడ్డి అన్నారురూ. 25కోట్లకుపైగా వ్యయంతో జరుగుతున్న ప్రాంతీయవైద్యశాల నిర్మాణపనులను శనివారం ఆయన మున్సిపాలిటి చైర్మన్‌పోలా శ్రీనువాసులరెడ్డితో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ స్థాయిలో వైద్యసేవలకు సంబంధించి అన్ని సంపూర్తిగా ఉండేలా నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. 100 పడకలతో ఆసుపత్రి ఆహ్లాదకరమైన వాతవరణంలో నిర్మితం కొనసాగుతోందన్నారు. త్వరలో అందుబాటులోకి తీసుకురావడానికి కృషిచేస్తున్నామన్నారు. ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు కూడా చేయనున్నట్లు వెల్లడించారు. మున్సిపాలిటి చైర్మన్ పోలా శ్రీనువాసులరెడ్డి, వైస్‌చైర్మన్ మర్రి రవి, ఆర్‌డీసీ డైరక్టరు గండికోట గుల్జార్ బాష, ప్రాంతీయవైద్యశాల అభివృద్ధి కమిటి సభ్యులు హస్తవరం ఉమామహేశ్వరరెడ్డి, మున్సిపాలిటి జేఏసీ కన్వీనరు వడ్డెరమణ, సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకులు కొండూరు శరత్‌కుమార్‌రాజు, నాయకులు పోలి మురళీరెడ్డి, శంకర్‌శెట్టి, మున్సిపాలిటి కమిషనరు జనార్ధన్‌రెడ్డి, సీఐ ముద్దయ్య ఆచారి, ఎస్ఐ ప్రసాద్‌రెడ్డిలతో పాటు వైద్యులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



వైద్యశాల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

**అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి స్థల పరిశీలన**

రాజంపేట టౌన్: అసంపూర్తిగావున్న రాజంపేట రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ)కి అప్రోచ్ రోడ్ల నిర్మాణం కోసం శనివారం ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి ఆర్డీఓ రామకృష్ణారెడ్డి,, ఆర్అండ్‌బీ ఈఈ సహదేవరెడ్డితో కలిసి రైల్వేస్టేషన్‌కు రెండువైపులా తిరిగి స్థల పరిశీలన చేశారు. ఈసందర్భంగా ఆర్అండ్‌బీ ఈఈ సహదేవరెడ్డి రైల్వేస్టేషన్‌కు రెండువైపులా ఎంతమేర రోడ్డును నిర్మించాల్సి వస్తుందన్న వివరాలను ఎమ్మెల్యేకి తెలియ చేశారు. కాగా రోడ్ల నిర్మాణంలో భాగంగా ప్రైవేట్ వ్యక్తులకు సంబంధించి కొంత స్థలాన్ని తీసుకోవాల్సి ఉంటుందని, అందువల్ల ఎంత మేర స్థలం అవసరం అవుతుందో సర్వే చేయించాలని రెవెన్యూ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. బాధితులందరికి కూడా న్యాయం చేస్తామని ఎమ్మెల్యే భరో సా ఇచ్చారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి రోడ్ల నిర్మాణంపై యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని ఆదేశించారు. వైఎస్సార్ సీపీ నాయకులు అనీల్‌కుమార్‌రెడ్డి, డీఎస్పీ చైతన్య, తహశీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి, మున్సిపల్ కమీషనర్ జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణంపై అధికారులతో చర్చిస్తున్న మేడా

# పేదల సౌలభ్యం కోసమే కల్యాణ మండపం

**ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి**

రాయచోటి : పేద, మధ్యతరగతి ప్రజల వివాహ, ఇతర శుభ కార్యక్రమాల సౌలభ్యం కోసమే టీటీడీ కళ్యాణ మండపం నిర్మాణం పనులను చేపడుతున్నట్లు ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాల సమీపంలో రూ. 3.5 కోట్లతో నిర్మాణమవుతున్న టీటీడీ కళ్యాణ మండపం పనులను మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డితో కలిసి పరిశీలించారు. భవనాలు, కాంపౌండ్ వాల్, డ్రైనేజీ, భూమి చదును పనులను డిసెంబర్ నెల చివరిలోపు పూర్తి చేయాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ టీటీడీ కళ్యాణ మండపం నిర్మాణం 1.65 ఎకరాల స్థలంలో చేస్తున్నామన్నారు. తొలుత రూ. 2.25 కోట్లు నిధులు అయ్యాయని తెలిపారు. జిల్లా కేంద్రం అయిన తరువాత ఏసీ, ప్రహరీ నిర్మాణాలకు మరో రూ.1.25 కోట్లు నిధులు మంజూరుకు ఈనెల 14న జరిగిన బోర్డు మీటింగ్‌లో ఆమోదం తెలిపారన్నారు. కాంట్రాక్టర్ శ్రీధర్ రెడ్డి, ఫయాజ్ అహ్మద్, వసంత శ్రీనివాసులు రెడ్డి, వాసుదేవరెడ్డి, నవరంగ్ నిస్సార్, చిన్న, సంజీవ తదితరులు పాల్గొన్నారు.



టీటీడీ కళ్యాణ మండపం నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

**ఆటోనగర్ స్థల సేకరణకు కృషి**

రాయచోటిలో ఆటోనగర్ ఏర్పాటుకు స్థల సేకరణకు కృషి చేస్తానని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి హామీ ఇచ్చారు. శనివారం పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పట్టణంలోని ఆటో కార్మికులు, మెకానిక్‌లు మూకుమ్మడిగా ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డిని కలిసి ఆటోనగర్‌కు పది ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ఇప్పించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే రెవెన్యూ అధికారులతో మాట్లాడి హైవేలో అనుకూలమైన స్థలాన్ని కేటాయించేలా కృషి చేస్తామని వారికి హామీ ఇచ్చారు.

# కులగణన పక్కాగా జరగాలి

● రాజంపేట ఆర్డీఓ రామకృష్ణారెడ్డి

రాజంపేట: రాజంపేట రెవిన్యూ డివిజనల్‌లో కులగణన పక్కాగా జరగాలని రాజంపేట రెవెన్యూ డివిజనల్ అధికారి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం కులగణనపై తహసీల్దారు, ఎంపీడీఓలకు ఆర్డీవో సభాభవనంలో ఒకరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలు అనుగుణంగా కులగణన నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఇందుకోసం సర్వే చేయాల్సి ఉంటుందన్నారు. ఈనెల 27 నుంచి వచ్చేనెల 5 నాటికి పూర్తి కావాలన్నారు. వలంటీర్లు తమ మొబైల్‌లో యాప్‌ను అప్‌లోడ్ చేయించుకోవాలన్నారు. సచివాలయసిబ్బంది, వలంటీర్లు సంయుక్తంగా కులగణన సర్వే చేయాలన్నారు. ఈ సర్వేకి కుటుంబసభ్యులు సహకారం అందించాలన్నారు. డీఎల్‌డీఓ ఎం,నరసింహామూర్తి, మాస్టర్ ట్రైనర్లు రామమోహన్, సుబ్రమణ్యంరెడ్డి, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఆర్డీవో

# వడ్డెర్ల జోలికివస్తే సహించేది లేదు

**–వడ్డెర కమ్యూనిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నేత వడ్డె రమణ ధ్వజం**



రాజంపేట: పుట్టపర్తిలో ఇటీవల జరిగిన టీడీపీ జనసేన సభలో వడ్డెర్లను కించపరిచే విధంగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు పార్థసారధి మాట్లాటడం సరికాదని, తమ జోలికి వస్తే సహించేదిలేదని వడ్డెర కమ్యూనిటి కౌన్సిల్ ఆఫ్ ఇండియా గౌరవ అధ్యక్షుడు, రాష్ట్ర వడ్డెరల సంఘం గౌరవ అధ్యక్షుడు వడ్డెరమణ హెచ్చరించారు. శనివారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నోరు అదుపులో పెట్టుకొని పార్థసారధి మాట్లాడితే మంచిదన్నారు. వడ్డెరలకు బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. వడ్డెర్లకు తగిన గుర్తింపు ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని గుర్తు చేశారు. అది జీర్ణించుకోలేక పార్థసారధి అక్కసు వెల్లగక్కుతున్నారని మండిపడ్డారు.

# విద్యార్థి హక్కుల పరిరక్షణ కోసం పోరాటం

రాయచోటి అర్బన్: విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం రాజీలేని పోరాటం సాగిస్తామని ఆర్ఎస్ వైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగేంద్రబాబు అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించిన ఆర్ఎస్‌వైఎఫ్ సమావేశంలో ఆర్ఎస్‌వైఎఫ్ కమిటీఎంపిక నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడుగా సాయికృష్ణ, ఉపాధ్యక్షులుగా అమర్‌నాథ్,షేక్ సమీర్‌ను ఎన్నుకున్నారు.



# ఖాతాదారుల సేవే లక్ష్యం

● ప్రజల ఆర్థిక అవసరాల కోసం కెనరా బ్యాంక్ లోన్స్
● సీనియర్ మేనేజర్ పంజగల వెంకటేశ్వర్లు



కెనరాబ్యాంకు వార్షికోత్సవం సందర్భంగా సిబ్బందితో సీనియర్ మేనేజర్ పంజగల వెంకటేశ్వర్లు

రైల్వేకోడూరు : గ్రామీణ ప్రాంత రైతులకు, చిన్న సన్నకారు రైతులకు, 5వేల ఎస్‌జిహెచ్ మెంబర్స్‌కు యాభై ఏళ్లుగా సేవలందిస్తున్నామని.. ప్రజలు, ఖాతాదారుల సేవే లక్ష్యమని కెనరాబ్యాంకు సీనియర్ మేనేజర్ పంజగల వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం పట్టణంలోని కెనరాబ్యాంకు 118వ వార్షికోత్సవం సందర్భంగా ఖాతాదార్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ బ్యాంకులో 30వేల మంది అకౌంట్ హోల్డర్స్‌కు అన్ని విదాలుగా ఎడ్యుకేషన్‌లోన్స్, బిజినెస్ లోన్స్, హౌసింగ్ లోన్స్, క్రాప్ లోన్స్ ఇస్తున్నామన్నారు. తమ బ్రాంచి నుంచి 150 కోట్లు లోన్స్ ఇచ్చామని, 80 కోట్లు డిపాజిట్ చేశారని తెలిపారు. 118 వ వార్షికోత్సవం సందర్భంగా కస్టమర్లందరిని సత్కరించామన్నారు. బ్యాంక్ సర్వీస్ గురించి అందరికీ అవగాహన కల్పించామన్నారు. ఎటువంటి లోన్స్ కావాలన్నా ఇచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ప్రజలందరూ ఆర్థిక సేవలను ఉచితంగా పొందే సద్వినియో గం చేసుకోవాలన్నారు. వివిధ ప్రభుత్వ ఆర్థిక పథకాలు తెలుసుకుని లబ్ధి పొందాలని వ్యవస్థ గురించి తెలుసుకుని సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. కెనరా బ్యాంక్ సేవలను గ్రామాల ప్రజలు, రైతులు, డ్వాక్రా సంఘాల మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. యువతకు, మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో కెనరాబ్యాంకు ముందంజలో ఉంటుందన్నారు. మేనేజర్ ప్రతీప్‌రాజు, వెలుగు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయసదస్సులతో ఉపయోగం

రాజంపేట: జాతీయసదస్సులే విద్యార్థి పరిశోధన జ్ఞానానికి ఆధారమని ఏపీ స్టేట్ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్టర్ విలియం కేరి అన్నారు. శనివారం అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో రెండవరోజు జాతీయసదస్సుకు హాజరై ప్రసంగించారు. మెయిన్ స్ట్రింగ్స్ ఎండీ కె.బసప్ప మాట్లాడారు. ఏఐటీఎస్ వైస్‌చైర్మన్ చొప్పాఎల్లారెడ్డి, ప్రిన్సిపాల్ డా.స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

## నేడు మెగా వైద్య శిబిరం

సిద్దవటం: మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీలోని శాంతి హెల్త్ క్లీనిక్‌లో ఆదివారం 9 గంటల నుంచి మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు స్థానిక సర్పంచ్ జానకిరామయ్య, మాజీ సర్పంచ్ మేకపాటి సుబ్బారెడ్డి తెలిపారు. ఈ వైద్య శిబిరానికి గుండె వైద్య నిపుణులు ఎం.డి. నవీద్‌అహ్మద్, డాక్టర్ తౌసిఫ్( జనరల్ మెడిషన్) హాజరువుతున్నారన్నారు.

## హెల్మెట్ తప్పనిసరి

లక్కిరెడ్డిపల్లి: ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ తప్పక ధరించాలని లక్కిరెడ్డిపల్లె సిఐ యుగంధర్, ఎస్ఐ మల్లికార్జున రెడ్డిలు తెలిపారు. శుక్రవారం లక్కిరెడ్డిపల్లె కోర్టు సమీపంలో వాహనాలను తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వివాదాస్పద స్థలం పరిశీలన

రాజంపేట: మండలంలోని కొత్త బోయనపల్లె ఎస్సీకాలనీలో వివాదాస్పద స్థలాన్ని ఉమ్మడి కడప జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వెంకటసుబ్బయ్య శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెడ్‌హెచ్‌డీసీ పరిధిలో 25 మందికి కోళ్లఫారాల కోసం ఇచ్చామన్నారు. కొందరు ఆక్రమించి అమ్మకానికి పెట్టారని పిర్యాదులు వచ్చాయన్నారు. ఆర్డీవో ద్వారా తనిఖీ చేసి అర్హులైన ఎస్సీలకు చెందేలా చూస్తామన్నారు.

## స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు

నందలూరు (రాజంపేట) : నందలూరు బస్టాండ్ సమీపంలో జాతీయ రహదారికి నాలుగువైపులా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి ఆదేశాల ప్రకారం ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి సూచనతో ఆర్అండ్‌బీ అధికారులు వీటిని ఏర్పాటు చేశారు. రాజంపేట సీఐ మంజునాథ రెడ్డి, ఎస్ఐ జహీర్ పరిశీలించారు. జిల్లా వక్ఫ్ బోర్డ్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ అమీర్, సర్పంచ్ జంబు సూర్యనారాయణ, మండల కో-ఆప్షన్ సభ్యులు కరిముల్లా ఖాన్ పాల్గొన్నారు.

## ఫీజుల దోపిడీపై చర్యలు తీసుకోండి

రాయచోటి అర్బన్ : పదో తరగతి పరీక్ష ఫీజుల పేరుతో దోపిడీ చేస్తున్న కార్పొరేట్, ప్రైవేటు,ఎయిడెడ్ పాఠశాలలపై విచారించి చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్రసహాయ కార్యదర్శి ఎం.అంకన్న డిమాండ్ చేశారు. శనివారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో జిల్లా డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం విద్యాశాఖ సహాయసంచాలకుల కార్యాలయం ఏడీ ప్రసాద్‌బాబుకు వినతిపత్రమిచ్చారు. పీడీఎస్‌యూ నేతలు పాల్గొన్నారు.